ప్రజాశక్తి
సోమవారం 5 ఆగస్టు 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

బియ్యంపై టిడిపి నేతల కన్ను

- రేషన్ డీలర్‌షిప్ కోసం యత్నాలు
- రేషన్ వాహనాల కొనసాగింపుపై సందిగ్ధం
- ఆగని బియ్యం అక్రమ వ్యాపారం



ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రేషన్ సరఫరా చేసే చౌకడిపోలను తమకు అనుకూలమైన వారికి ఇప్పించుకునేందుకు టిడిపి నేతలు పావులు కదుపుతున్నారు. ప్రధానంగా పల్నాడు జిల్లాలో అధికారంలో ఎవరు ఉంటే ఆ పార్టీ వారి అధీనంలోనే రేషన్ దుకాణాలు నిర్వహించడం చాలా కాలంగా ఆనవాయితీగా వస్తోంది. ఇదే కోవలో 2019లో టిడిపికి అనుకూలంగా ఉన్న వారిని తొలగించి వైసిపికి అనుకూలంగా ఉన్న వారిని డీలర్లుగా నియమించారు. ఇప్పుడు మళ్లీ టిడిపి అధికారంలోకి రావడంతో తిరిగి ఆ పార్టీ నాయకులు ఎమ్మెల్యేల ద్వితీయ శ్రేణి నాయకులు తమ అనుయాయులకు రేషన్ డిపోలను కట్టబట్టేందుకు అధికారులకు జాబితాలను సమర్పించారు. ఈ ప్రక్రియ గత పక్షం రోజులుగా కొనసాగుతోంది. అధికారికంగా మార్చకుండా అనధికారికంగా ఈనెల నుంచి మార్చాలని అధికారులపై వత్తిడి పెరిగింది.

ప్రధానంగా రేషన్ డిపోలకు ప్రభుత్వం ఇచ్చే కమీషన్ సరిపోవడం లేదని చెబుతున్న డీలర్లు అక్రమాలకు పాల్పడటం ద్వారా ఎక్కువ మంది లబ్ధిపొందుతున్నారు. డిపోను ఇప్పించినందుకు రూ.లక్ష వరకు మామూళ్ల కూడా కొంతమంది వసూలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోనే రేషన్ బియ్యం వ్యాపారం జోరుగా సాగుతున్న నేపథ్యంలో డిపోల నిర్వహణకు పెద్ద సంఖ్యలో ఔత్సాహికులు ముందుకు వస్తున్నారు. అంతేగాక ప్రస్తుతం డిపోల నిర్వాహకులకు కిలోకి రూపాయి కమిషను ఇస్తున్న ప్రభుత్వం రేషన్ సరఫరాచేసే వాహనదారులకు రూ.21 వేలు చెల్లిస్తోంది. మొత్తం ఒకే పనికి రెండు సార్లు వైసిపి ప్రభుత్వం రుసుము చెల్లిస్తోంది. దీనిపై సమీక్షించిన టిడిపి ప్రభుత్వం రేషన్ పంపిణీలో మార్పులు చేయాలని నిర్ణయించింది. దీంతో రేషన్ సరఫరా చేసే ఎమ్‌డియు వాహనాల నిర్వాహకుల భవిత్యం ప్రశ్నార్ధకంగా మారింది.

ఇప్పటికే ఈ వాహనాల గురించి పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రతికూల వ్యాఖ్యలు చేశారు. ఈ వాహనాలు అవసరమా అని ఆయన నేరుగా ప్రశ్నించారు. వీటి వల్ల ఉపయోగం లేదు. ఇంటికే రేషన్ విధానం అమలు కావడం లేదు. ఏదో ఒక కూడలిలో వాహనం పెట్టి వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నారని అందువల్ల ఈ విధానంలో మార్పులు చేయాలని మంత్రి నాదెండ్ల అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం వాహనాల నుంచి బియ్యం సరఫరాలో కూడా అక్రమాలు చేసుకుంటున్నట్టు టిడిపి ప్రభుత్వం గుర్తించింది. కొంత మంది వాహనదారులు వినియోగదారులకు బియ్యం ఇచ్చినట్టు బయోమెట్రిక్ నమోదు చేసి బియ్యంకు బదులుగా నేరుగా నగదు ఇస్తున్నారు. మార్కెట్‌లో బియ్యం ధరలు పెరగడంతో రేషన్ బియ్యంకు కూడా కిలో రూ.10 నుంచి రూ.20 వరకు చెల్లిస్తున్నారు. గతేడాది వరకు కిలోకి రూ.6 నుంచి 8 చెల్లించిన వాహనదారులు లేక డీలర్లు ఇప్పుడు ఈ ధరను రెట్టింపు చేశారు. రేషన్ బియ్యం వినియోగదారులకు సరఫరా చేసినట్టు రికార్డుల్లో వాటిని రైస్ మిల్లర్లకు తరలిస్తున్నారు. విజిలెన్సు అధికారులు అడపాదడపా దాడులు చేసి రేషన్ బియ్యం పట్టుకున్నా దొరికిన వాడు దొంగ, దొరకని వాడు దొర అన్న చందంగా రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం సాగిపోతోంది.

కార్డులపై సరఫరా చేయాల్సిన బియ్యంను కిలో రూ.30 నుంచి రూ.40 చొప్పున తమిళనాడు, గుజరాత్, కర్నాటక రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నా పౌరసరఫరా శాఖ ప్రేక్షకపాత్ర పోషిస్తుంది. విజిలెన్సు ఉన్నతాధికారుల సూచనల మేరకు జిల్లా అధికారులు నిఘా పెట్టి రేషన్ బియ్యం నిల్వకేంద్రాలపై దాడులు చేస్తున్నారు. రేషన్ పంపిణీ వాహన దారుల నుంచి

2లో

9న క్విట్ కార్పొరేట్ నిరసనలు

రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులంతా పాల్గొనాలని రైతు సంఘం పిలుపు



వివరాలు చెబుతున్న జొన్నా శివశంకరరావు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కార్పొరేట్ కబంధ హస్తాల నుండి వ్యవసాయ రంగాన్ని కాపాడుకునేందుకు, రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో 9న జరిగే క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. వడ్డేశ్వరంలోని కెబి భవన్‌లో రైతు సంఘం నాయకులతో కలిసి ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి, ప్రధాని అయిన మోడీ... రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని నమ్మించి చివరికి వ్యవసాయ రంగాన్ని విచ్ఛిన్నం చేసేలా నల్ల చట్టాలు తెచ్చిందని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా రైతులు ఏడాదికిపైగా పోరాడ్డంతో వాటిని రద్దు చేసిందని, అయితే ఆ సందర్భంగా ఇచ్చిన హామీలను మాత్రం విస్మరించి రైతుల్ని మరో సారి మోసం చేసిందని అన్నారు. వ్యవసాయ రంగంతో అనుబంధమున్న అన్నింటినీ అదానీ, అంబానీ తదితర కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని, రైతుల ప్రయోజనాలను కాపాడే విత్తన చట్టాన్ని రద్దు చేశారని, క్రిమి సంహారక మందులపై నియంత్రణ తొలగించి ఎప్పటికప్పుడు ధరలు పెంచుకునే అవకాశాన్ని చ్చారని దుయ్యబట్టారు. బడ్జెట్లోనూ వ్యవసాయ రంగానికి కోతలు విధిస్తోందని తెలిపారు. రైతుల వద్ద పంట కొనుగోలను నిలిపేయ డంతోపాటు కేంద్ర సంస్థకు చెందిన రెండు కోట్ల టన్నుల గోడౌన్లను ఆదానికి అప్పగించారని విమర్శించారు. పొలాలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు వీలుగా చట్టాలను సవరిస్తున్నారని తెలిపారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా, దేశ స్వాతంత్ర్యానికి ముందుకు జరిగిన క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో ఆగస్టు 9న అన్ని ప్రాంతాల్లోనూ నిరసనలు జరుగుతాయని, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు ఎం.శివసాంబిరెడ్డి, కె.రామస్వామి, వి.వెంకట్రామయ్య పాల్గొన్నారు.

575 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం

ప్రజాశక్తి-విజయపురిసౌత్

కష్ణమ్మ పరవళ్ళతో ఎగువ జలాశయాలు నిండు కుండాల మారాయి. ఇప్పటికే శ్రీశైలం గేట్లు ఎత్తగా నేడు ఉదయం 8 గంటలకు ఎన్ఎస్పీ అధికారులు సాగర్ డ్యామ్ క్రష్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. ఎగువ శ్రీశైలం ప్రాజెక్టు నుండి 4,54,710 క్యూసెక్కుల వరద కొనసాగుతుండటం సాగర్ జలాశయం నీటిమట్టం ప్రస్తుతానికి 576.10 అడుగులకు చేరుకోవడం పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరువలో ఉంది. ఎగువ శ్రీశైలం నుండి భారీ వరద వస్తుండటంతో ముందస్తుగా అంచనా వేసి నేడు సాగర్ జలాశయానికి క్రష్ట్ గేట్ల ద్వారా అధికారులు నీటిని విడుదల చేయనున్నారు. నాగార్జున సాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు, పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 271.9007 టీఎంసీలనిల్వ ఉంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 26,040 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 5700 క్యూసెక్కులు, ఎడమ కాల్వద్వారా 4613 క్యూసెక్కులు, ఎస్.ఎల్.బి.సి ద్వారా 1200 క్యూసెక్కులు లో లెవల్ కెనాల్ ద్వారా 320 క్యూసెక్కులు, మొత్తం 37,873 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

మంత్రి ఇలాకాలో సిఆర్‌డిఏ కార్యాలయం అస్తవ్యస్తం



ఖాళీగా దర్శనమిస్తున్న జోనల్ డిడి సీటు

ఆ కార్యాలయంలో పేరుకే అధికారులు.. ఒక్కరూ అందుబాటులో ఉండరు... కార్యాలయం కూడా పాడు బడిన బంగ్గాలా దర్శనమిస్తుంది. కార్యాలయం లోపలి వాతావరణం మురికికూపమే. టేబుల్‌పై గ్లాసులు సోడా.. గదుల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తా చెదారం. కనీసం సమాచార బోర్డు కూడా మార్చని వైనం. కార్యాలయ ఉన్నతాధికారి ఉదయం 10.30కు కార్యాలయానికి రావటం, హాజరు నమోదు చేసి క్షణాల్లో వెళ్లిపోవటం. అన్నింటినీ మించి ఓ ఉద్యోగికి 2022 డిసెంబర్ నుంచి విధి నిర్వహణ లేకుండా కాళీగా కూర్చోబెట్టి జీతం చెల్లిస్తుండడం. ఇటీవల కార్యాలయంపై ఏసిబి అధికారులు దాడులు చేసి, లంచం తీసుకుంటున్న ఇద్దరు అధికారులను పట్టుకుని సస్పెండ్ చేయటంతో ఇక్కడో కార్యాలయం ఉందన్న సంగతి వెలుగులోకి వచ్చింది. మంత్రి ఇలాకాలో స్థానిక అమరావతి ప్లాట్స్ ఉడా కాలనీలోని సిఆర్‌డిఏ సబ్ డివిజన్ కార్యాలయంలో అధికారుల లీలలపై వివరాలు

5లో

6 నుండి బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ఆప్టిట్యూడ్ టెస్ట్

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2023లో విడుదల చేసిన పోటిఫికేషన్ ప్రకారం 54 ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి పెండింగ్‌లో ఉన్న 20 పోస్టులకు సంబంధించి మంగళవారం నుండి 13వ తేదీ వరకూ స్థానిక సిద్ధార్థ నగర్‌లోని జెసి లా కాలేజీలో ఆప్టిట్యూడ్ టెస్ట్ నిర్వహిస్తామని గుంటూరు జిల్లా కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం పోస్టుల్లో 34 పోస్టులు భర్తీ చేయగా, మిగిలిన 20 పోస్టులకు సంబంధించి కోర్టులో పిటిషనర్లు కేసు విత్‌డ్రా చేసుకోవటంతో వాటి భర్తీ చేపడుతున్నామని పేర్కొన్నారు. వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న 5,116 మంది అభ్యర్థులు పరీక్షలకు వారికి నిర్దేశించిన తేదీ, సమయంలో హాజరు కావాలని సూచించారు.



8లో

తాడేపల్లి సుందరయ్య నగర్‌లో జోలెపట్టి విరాళాలు సేకరిస్తున్న సిపిఎం శ్రేణులు

వయనాడ్ బాధితులకు విరాళాలు సేకరణ

ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాడు తహశీల్దార్ కె.రవిబాబు సూచించారు. తహశీల్దారు కార్యాలయంలో ప్రతిసోమవారం జరిగే కార్యక్రమంలో వివిధ సమస్యల అర్జీలను ఇస్తే వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరిస్తామని చెప్పారు. మండల స్థాయి అధికారులందరు ప్రజలకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అందుబాటులో ఉంటారని అన్నారు. అలా కాకుండగా ప్రతీ రోజు అర్జీలను స్వీకరించుట వల్ల, అవి ఆన్‌లైన్‌లో నమోదు కాక వాటికి, కాలపరిమితి ఉండక సమస్య కొనసాగుతుందని చెప్పారు. దీంతోపాటు మండల స్థాయి అధికారులందరు ఫీల్డ్ ఆఫీసర్లు అయినందున వారు వారంలో అన్నిరోజులూ కార్యాలయాల్లో అందుబాటులో ఉండరని, అందువల్ల అర్జీలనూ స్వీకరించక సమస్య పరిష్కారంలో జాప్యమవుతుందని చెప్పారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ పదేపదే తిరిగే పని లేకుండా సోమవారం ఆయా సమస్యలను అర్జీ రూపములో ఇవ్వాలని, వాటిపై మిగిలిన రోజుల్లో విచారణ జరిపి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.



నూతక్కిలో పూడికతీత పనులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్:

మానవవనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజి శాఖల మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో నూతక్కిలోని ప్రధాన మురుగునీటి కాల్వ పూడికతీత పనులను మంగళవారం చేయించారు. గ్రామంలోని గోదావరి చెరువు నుంచి ఎస్సీ కాలనీ పక్కగా రెండున్నర కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న మురుగునీటి కాల్వ వైసిపి ప్రభుత్వంలో ఆధునికీకరణకు నోచుకోక గ్రామంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షకాలంలో నీరు పోయేమార్గం లేక కాల్వ పొంగి మురుగునీరు పొలాల్లోకి ప్రవహిస్తుండడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనితో స్థానిక నాయకులు, రైతులు సమస్యను మంత్రి నారా లోకేష్‌దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. తన సొంత నిధులతో ముందస్తు చర్యల్లో భాగంగా పొలాలు మునిగిపోకుండా మురుగునీటి కాల్వలో పూడిత తీతపనులను టిడిపి గ్రామ అధ్యక్షులు సూర్య లక్ష్మీనారాయణ ప్రసాద్ ఆధ్వర్యంలో చేయించారు. కార్యక్రమంలో గోగుల వీరారెడ్డి, గుర్రపుశాల శ్రీను, గుంటూరు సుధీర్ పాల్గొన్నారు.



రూ.6 కోట్ల కోసం 60 పిటిషన్లు!

- చేసిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్ల బెంగ
- అప్పులకు వడ్డీలు చెల్లించేందుకు బంగారం, ఇళ్లు తనఖా
- కొత్త పనులు చేసేందుకు వెనకడుగు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఒకప్పుడు రూ.కోట్లలో అభివృద్ధి పనులు చేసిన వారు ఇప్పుడు అప్పులకు వడ్డీలు చెల్లించలేక అవస్థ పడుతున్నారు. ఎంత పెద్ద పనినైనా చేయించగలిగే వారే అయినా టెండర్లు వేయడానికే జంకుతున్నారు.. ఇప్పటికే చేసిన పనులకు బిల్లులు రాక, మున్సిపాల్టీ చూట్టూ తిరుగుతున్నా ఫలితం లేక పట్టణంలోని కాంట్రాక్టర్లు అవస్థ పడుతున్నారు.

గ్రేడ్-1 మున్సిపాల్టీ అయిన చిలకలూరిపేటలో ప్రతిఏటా రూ.కోట్లలో అభివృద్ధి పనులు జరుగుతుంటాయి. ఎ1 కాంట్రాక్టర్లు 10 మంది వరకూ ఉంటారు. ఎక్కువ మొత్తంలో పనులు వీరే చేయిస్తుంటారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు చేయగా ఆ బిల్లులింకా మంజూరు కాలేదు. ఈ క్రమంలో ప్రభుత్వం మారడంతో ఆ పనులను చేయించిన కాంట్రాక్టర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బిల్లులొస్తాయనే నమ్మకంతో అప్పులు తెచ్చి పనులు చేయించామని, ఇప్పుడు వాటికి వడ్డీలు చెల్లించలేక నానా అగచాట్లు పడుతున్నామని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. కొంతమందైతే అప్పులకు వడ్డీలు కట్టడానికి తమ బంగారం, ఇళ్లు తనఖా పెట్టానని ఒక కాంట్రాక్టర్ ఆవేదనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త పనులు చేసేందుకు కాంట్రాక్టర్లేవరూ ముందుకు రావడం లేదు. కమిషనరే స్వయంగా కాంట్రాక్టర్లను బతిమాలాల్సి వస్తోంది. పలుమార్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చినా బిల్లులు మాత్రం మంజూరవడం లేదు.



చిలకలూరిపేట మున్సిపల్ కార్యాల భవనం

పట్టణంలో సిసి రోడ్లు, డ్రెయినేజీ కాల్వలు, సప్టాల నిర్మాణం, పలు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా, చెరువులను సాగర్ జలాలతో నింపడం తదితర పనులను గత ప్రభుత్వ హయాంలో చేశారు. వీటిల్లో కొన్నింటికి బిల్లులు మంజూరవడంతో మిగతా పనులకూ అదేవిధంగా మంజూరవుతాయనే ఉద్దేశంతో కాంట్రాక్టర్లు వెనకాడకుండా పనులు చేయించారు. అయితే 2022 జూన్ నుండి చేసిన పనులకు బిల్లులకు బ్రేకు పడింది. మరోవైపు ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టర్లలో మరింత బెంగ పెరిగి బిల్లుల కోసం కోర్టును ఆశ్రయించారు. 60 వరకూ పిటీషన్లు వేసి తమకు డబ్బులు ఎప్పుడు వస్తాయోనని నిరీక్షిస్తున్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలి

ప్రజాశక్తి-పొన్నూరు

ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసే మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపిపి భవనం పద్మలీల కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశపు హాలులో ఆదివారం జరిగిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపిపి అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యుత్ కనెక్షన్లు పెండింగ్లో ఉన్నాయని, విద్యుత్ శాఖ అధికారులు దృష్టిసారించి మీటర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. పలు గ్రామాల్లో వీధిలైట్ల కోసం స్తంభాలు ఏర్పాటు చేయాలని గతంలో కోరామని గుర్తు చేశారు. పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు మాట్లాడుతూ పలు శాఖలకు చెందిన అధికారులు సమస్యలు పరిష్కరించడంలో ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. మండల వ్యవసాయ అధికారి దేగల వెంకటరామయ్య మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న తమ వరి పొలాలకు ఈ-క్రాప్ బుకింగ్ సకాలంలో చేయించుకోవాలని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్లో రైతుల పొలాల లోని 1045 మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేసి ఫలితాలను వారికి అందజేశామన్నారు. మండల విద్యాశాఖ అధికారి కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈనెల 8వ తేదీన మండలంలోని 88 ఎలిమెంటరీ, యూపీ, జడ్పీ పాఠశాలలకు స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. హార్టికల్చర్ ఆఫీసర్ ఉష మాట్లాడుతూ పొన్నూరు, చేబ్రోలు, కాకుమాను మండలాల్లో కూరగాయ రైతులకు వ్యవసాయ పనిముట్లకు, వివిధ పథకాలకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న వివరాలను తెలియజేశారు. మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ గౌస్ మొహిదీన్ మాట్లాడుతూ 22 జగనన్న లేఔట్లలో 1471 గృహాల నిర్మాణానికి ప్రభుత్వ అనుమతి పొందామన్నారు. ఇప్పటివరకు 205 గృహాలు నిర్మాణం పూర్తి చేశామని, కొత్తగా 300 అర్జీలు వచ్చాయని, వాటి మంజూరుకూ చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇరిగేషన్ శాఖ ఏఈ శిరీష మాట్లాడుతూ తమ పరిధిలోని పంట కాల్వలకు ఏడు పనుల ద్వారా రూ.60 లక్షలతో తూటి కాడ, గుర్రపు డెక్క పనులు చేస్తున్నామని చెప్పారు. విద్యుత్ ఏఈ నారాయణ మాట్లాడుతూ జగనన్న లేఔట్ కాలనీలో వినియోగదారులకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యుత్ స్తంభాలపై లూజుగా ఉన్న తీగలను పటిష్టం చేసి కింద వేలాడకుండా పనులు చేపట్టామన్నారు. సమావేశంలో సిడిపిఒ వెంకటరమణ, వెలుగు డిపిఎం గోపి, వెటర్నరీ డాక్టర్ షైనీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రావ్య, హెల్త్ సూపర్వైజర్ ఎం.వేణు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి పద్మలీల

బియ్యంపై టిడిపి నేతల కన్ను

(మొదటి పేజీ తరువాయి)

కొంతమంది అక్రమార్కులు ఇతర రాష్ట్రాలకు పంపుతున్నారు. గుంటూరు నుంచి కాకినాడ, కృష్ణపట్నం ఓడరేవు ద్వారా ఇతర రాష్ట్రాలకు రేషన్ బియ్యం తరలిపోతుండగా ఇప్పటికే పలు మార్లు పోలీసులు, విజిలెన్సు అధికారులు వేర్వేరుగా వీటిని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారు. రేషన్ వాహనాలపై రెవెన్యూ,పౌరసరఫరా శాఖ నిఘా కొరవడింది. ఎక్కడా తనిఖీలు లేవు. గతంలో డీలర్లు సరిగా సరఫరా చేయడం లేదని ఇంటింటికి రేషన్ పథకం ప్రవేశపెట్టినా వాహనాదారులపై నియంత్రణ కొరవడం వల్ల యథేశ్చగా రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం జోరుగా సాగిపోతోంది. రేషన్ బియ్యాన్ని రైస్ మిల్లర్లు కిలో రూ.20కి కొనుగోలు చేసి పాలిష్ పట్టి సాధారణ రకం, సోనామసూరిలో కలిపి విక్రయిస్తున్నారు.

దంతవ్యాధులకు ఆధునిక చికిత్స

ప్రజాశక్తి-గుంటూరు

దంత వ్యాధులు - ఆధునిక చికిత్సలు అనే అంశంపై స్థానిక అరండల్‌పేట అవగాహన కార్యాలయంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. డాక్టర్ సయ్యద్ నజీమా మాట్లాడుతూ దంతాలు ఆరోగ్యంగా ఉంచుకోవడం చాలా ముఖ్యమని, దంతాలు లేకుండా ఆహారం తీసుకోవడం చాలా కష్టమని, దంతాల సహాయంతోనే ఆహారాన్ని బాగా నమిలి తినడం ద్వారా ఆరోగ్యంగా ఉండగలుగుతారని వివరించారు. ఆహారాన్ని నమలలేని స్థితిలో ఉంటే శరీరానికి సరిపడా ఆహారం తీసుకోకపోవడమే కాకుండా, తీసుకున్న ఆహారం కూడా సరిగా జీర్ణంకాక గ్యాస్ట్రబుల్, అజీర్ణం లాంటి సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. దంతాలను ఎప్పటికప్పుడు ఆరోగ్యకరమైన స్థితిలో ఉంచుకుంటే ఆరోగ్యానికి చాలా మేలని చెప్పారు. కనీసం ఆరు నెలలకు ఒక్కసారైనా దంత వైద్యుల వద్దకు వెళ్లి దంతాలు శుభ్రం చేయించుకోవాలని సూచించారు. పళ్లు ఏదైనా పుచ్చినట్లు కనపడితే తొలి దశలోనే గుర్తించి, ఎక్కువ ఇబ్బంది కాకుండా వైద్యులను సంప్రదించి తగిన వైద్యాన్ని పొందాలన్నారు. దంతాలు పుచ్చిన సందర్భంలో వెంటనే డాక్టర్ను సంప్రదిస్తే ఆపుచ్చును తొలగించి సిమెంట్ వేయడం, క్యాప్‌ను అమర్చడం ద్వారా దంతాలు సురక్షితంగా ఉంచుతుందన్నారు. ఇంప్లాంట్స్ గురించి వివరిస్తూ ముఖ్యంగా వ్యక్తి ఆరోగ్య స్థితిని బట్టి ఇంప్లాంట్స్‌ను వైద్యులు నిర్ణయిస్తారన్నారు. చిగుర్లు బాగా సున్నితంగా ఉన్నవారు సాఫ్ట్‌బ్రష్ వినియోగించాలని, సాధారణంగా అందరూ మీడియం విత్ క్రాస్ బ్రెజిల్స్ ఉన్న బ్రష్ వాడితే మంచిది అన్నారు. హార్డ్ బ్రెజిల్ ఉన్న బ్రష్ వాడటం మంచిది కాదన్నారు. ఆహారం తిన్న తర్వాత నీటితో పుక్కిలించి ఊయాలన్నారు. పళ్ళకు పట్టిన గార తొలి దశలోనే శుభ్రం చేయించుకోవాలని, లేకుంటే బ్యాక్టీరియా చేరి ఆహారం తీసుకున్న ప్రతిసారి ఆహారంతో పాటు ఆ బ్యాక్టీరియా పొట్టలోకి చేరి రకరకాల ఇన్ఫెక్షన్లకు దారితీస్తుందని వివరించారు. మౌత్‌వాష్ డాక్టర్ సలహాతోనే వినియోగించుకోవాలన్నారు. వైద్యుల సలహా లేకుండా మెడికేటెడ్ పేస్టులు వాడకూడదు అన్నారు. సభలో టీవీ సాయిరాం కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించగా, ఆరోగ్య ప్రచారకులు వి.వి.రావు, విశ్రాంత ఉపాధ్యాయులు ముప్పాళ్ల ప్రసాదరావు పాల్గొన్నారు. ఉచిత దంత పరీక్షల శిబిరం ప్రత్యూష దంత వైద్యశాల డాక్టర్లు సిబ్బంది సహకారంతో నిర్వహించారు. 120 మంది పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరాన్ని నంబూరు చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎమ్‌డి కొండా కోటిరెడ్డి ప్రారంభించారు.



సభలో మాట్లాడుతున్న డాక్టర్ నజీమా

'గోకులం' షెడ్లకు గిరాకీ

- పెదకూరపాడు మండలానికి 25 షెడ్లు మంజూరు
- వాటి సంఖ్య పెంచాలని డిమాండ్



ప్రజాశక్తి-పెదకూరపాడు

వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పాడి రైతుల పథకాలను ప్రస్తుత తెలుగుదేశం కూటమి ప్రభుత్వం తిరిగి గాడిలో పెట్టింది. ఇందులో భాగంగా గతంలో అమలు చేసిన పథకాలకు మరింత తోడ్పాటు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. పశువులకు సంబంధించి గోకులాల పేరిట షెడ్లు నిర్మించేందుకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. గతంలో తెలుగుదేశం పార్టీ హయాంలో రైతులు ఈ పథకంలో భాగంగా వందలాది షెడ్లు నిర్మించుకున్నారు. వైసీపీ ప్రభుత్వం వాటికి బిల్లులు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది కూటమి ప్రభుత్వం తిరిగి గోకులం పథకం తీసుకొచ్చింది. దీంతో గోకులం షెడ్డులకు గిరాకీ పెరిగింది.

రాయితీలు ఇలా

యూనిట్ ఖరీదు లో రైతు అది శాతం చెల్లించవలసి ఉంటుంది. రెండు పశువులు ఉన్న యూనిట్టు షెడ్డు కు ఒక లక్ష 15000 వాటిలో రైతు 11,500 చెల్లించవలసి ఉంటుంది. నాలుగు పశువులు ఉన్న షెడ్డు కు యూనిట్ ఖరీదు 1,85,000 కాక 18,500 రైతు వాటాగా ఉంటుంది. ఆరు పశువులు దాటితే యూనిట్ ఖరీదు 2,30,000 అందులో రైతు 23 వేల రూపాయలు చెల్లించవలసి ఉంటుంది.

20 గొర్రెలు మేకలు యూనిట్ ఖరీదు ?130,000 కాగా అందులో 39వేల రూపాయలు రైతు వాటా ఉంటుంది. 50 దాటితే యూనిట్ ఖరీదు 2,30,000 అందులో 69 వేల రూపాయలు రైతు చెల్లించవలసి ఉంటుంది. 100 కోళ్ళు అయితే యూనిట్ ఖరీదు 1,32,000 కాగా అందులో 39 వేల రూపాయలు రైతుల వాటాగా ఉండాలి.

కోళ్ల పెంపకం దారులకు అవకాశం

ఈసారి కోళ్ల పెంపకం దారులకు కూడా షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వ అవకాశం కల్పించింది. వీరికి 70 శాతం రాయితీ కల్పించారు. గొర్రెలు, మేకలకు సంబంధించి 30 శాతం లబ్ధిదారులు భరించాలి. పాడి రైతులకు మాత్రం 90 శాతం రాయితీ దక్కనుంది. నిర్మాణాలు కనీసం 10 నుంచి 15 ఏళ్లు ఉండేలాగా జాగ్రత్తలు తీసుకోనున్నారు. ఉపాధి పథకాల భాగంగా నిధులు చెల్లింపులు చేపట్టనున్నారు.

లబ్ధిదారుల ఎంపిక ఇలా

గోకులాల షెడ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ఎంపికకు నిబంధనలు ఇలా ఉన్నాయి. దరఖాస్తుదారుడికి తన పేరుతోనే స్థలము ఉండాలి. గ్రామ సభ ద్వారా గ్రామపంచాయతీ తీర్మానం చేసి ఉండాలి. బ్యాంకు, ఆధార్, పాన్ కార్డు జతపరచాలి. తొలి ప్రాధాన్యతగా ఎస్సీ, ఎస్టీ, పేద మహిళలు యజమానులుగా ఉన్న వారికి ఇస్తారు. చిన్న సన్న కారు రైతులై ఉండాలి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పొందిన జాబ్ కార్డు తప్పనిసరి.

సంఖ్య పెంచాలి

గోకులం పథకం కింద ఒక్కొక్క మండలానికి 25 షెడ్లు మంజూరయ్యాయని అధికారులు తెలుపుతున్నారు. దరఖాస్తులు పెద్ద ఎత్తున వస్తున్నాయి. దీంతో లబ్ధిదారుల ఎంపిక రాజ కీయపరంగా మారే అవకాశం ఉంటుంది. అర్హులందరికీ షెడ్లు కేటాయించేలా వాటి సంఖ్య పెంచాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

భార్య కనిపించడం లేదని ఫిర్యాదు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు



బాబుతో త్రివేణి

భార్య కనిపించడం లేదని భర్త పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన సంఘటన ప్రత్తిపాడులో చోటు చేసు కుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రత్తిపాడు మండలం కోయవారి పాలెం గ్రామానికి చెందిన తడవర్తి నాగరాజుకి మూడేళ్ల క్రితం గురజాలలోని పల్లెగుంతకి చెందిన త్రివేణతో పెళ్లి జరిగింది. వారికి ఒక పాప, పదకొండు నెలల బాబు ఉన్నారు. కొన్ని రోజులుగా వేరే కాపురం పెట్టే విషయమై భార్యాభర్తల మధ్య చిన్న చిన్న గొడవలు జరిగాయి. ఈ క్రమంలో ఈ నెల మూడవ తేదీ మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో త్రివేణి తన బాబు తో సహా ఎక్క డికో వెళ్లిపోయింది. అప్పటి నుండి ఇంటికి తిరిగి రాలేదు. తన భార్య కనిపించకుండా పోయి నట్లు భర్త నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రత్తిపాడు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మ నాయుడు తెలిపారు.



ఏ బంధానికైనా స్నేహమే పునాది

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఫ్రెండ్ షిప్ డే నిర్వహించారు. విద్యావేత్త ఇ.చంద్రయ్య మాట్లాడుతూ ఏ బంధానికైనా స్నేహమే పునాదని, దానికి ఎల్లలుండవని చెప్పారు. స్నేహం, బంధుత్వం కంటే గొప్పదని దానికి కుల,మత,హోదాలతో నిమిత్తం లేదని అన్నారు. మనం కష్టాల్లో ఉన్నప్పుడు నేను ఉన్నానని భుజం మీద చేయి వేసి నడిపే వారు స్నేహితులని చెప్పారు.

దళిత మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ప్రభుత్వ ఉద్యోగిపై కేసు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కలెక్టర్ బంగ్లాలో పని చేస్తున్న దళిత మహిళపై బంగ్లా ఇంచార్జ్ గా విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగి లైంగికంగా వేధిస్తూ ఉండటం తో సదరు మహిళా జిల్లా పోలీస్ కార్యాలయం లో ఫిర్యాదు చేయగా ఎస్.పి ఆదేశాల మేరకు నరసరావుపేట 2వ పట్టణ పోలీ సులు కేసు నమోదు చేశారు.నరసరావుపేట మండలం రావి పాడు గ్రామానికి చెందిన దళిత మహిళ కొద్ది నెలల నుండి కలెక్టర్ బంగ్లా లో వంట మనిషిగా పని చేస్తున్న క్రమంలో బంగ్లా ఇంచార్జ్ జాని భాష సదరు దళిత మహిళ పట్ల లైంగికంగా వేదింపులకు పాల్పడుతూ ఉండటం తో సదరు మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన 2వ పట్టణ పోలీసులు సదరు ప్రభుత్వ ఉద్యోగి పై కేసు నమోదు చేశారు.

ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యార్థి మృతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



షేక్ నాయబ్ ఖాజా ఖుదాబన్ మృతదేహం

ఈతకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన ఘటన నరసరావుపేట మండలం కోటప్పకొండ వద్ద చోటు చేసుకుంది. మండలంలోని తురక పాలెంకి చెందిన షేక్. నాయబ్ సుభాని చిన్న కుమారుడు నాయబ్ ఖాజా ఖుదాబన్ (17) యలమందలో 9వ తరగతి చదువుతున్నాడు. చిలకలూరిపేట చెరువుకు తాగునీరు నింపేందుకు నాగార్జున సాగర్ నీరు విడుదల చేశారు. ఆది వారం పాఠశాలకు సెలవు కావడంతో తోటి స్నేహితులతో కలిసి కాలువలో ఈత కొట్టేందుకని కోటప్పకొండ వద్దకు వెళ్ళాడు. ఈ క్రమంలో ఈత రాక నీట మునిగి ఇబ్బంది పడుతుండడాన్ని గమ నించిన స్నేహితులు అతన్ని ఒడ్డుకు చేర్చారు. అప్పటికే ఖుదాబన్ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీ సులు అతని మృతదేహాన్ని నరస రావుపేట ఏరియా ఆస్ప త్రికి తరలించారు. పోస్ట్ మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిం చారు. మృతుని తండ్రి నాయబ్ సుభాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ సిఐ పి.రామకృష్ణ తెలిపారు.

పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

- తెనాలి ఫ్లై ఓవర్ సమీపంలో 14 మంది జూదరులు అరెస్ట్
- రూ.1.73 లక్షల నగదు స్వాధీనం
- ఆత్మకూరు పరిధిలోని టేకు తోట ఏరియాలో ఏడుగురు అరెస్ట్
- రూ.1510 నగదు, ద్విచక్ర వాహనం, 4 సెల్ ఫోన్లు స్వాధీనం





మంగళగిలోని తెనాలి ఫ్లైఓవర్ సమీపంలోని సాయి రెసిడెన్సిలో, ఆత్మకూరులో పేకాట ఆడుతూ పట్టుబడ్డ జూదరులు

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని తెనాలి ఫ్లైఓవర్ సమీపంలో సాయి రెసిడెన్సి లో పేకాట ఆడుతున్నట్టు సమాచారం మేరకు పట్టణ పోలీసులు దాడి చేసి 14 మందిని అదుపులో తీసుకొని వారి వద్ద 1,73,500 నగదు, 14 సెల్ ఫోన్లు , మూడు ద్విచక్ర వాహనాలు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు నార్త్ డిఎస్పి రవికాంత్ ఉత్తర్వుల మేరకు మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ డి వినోద్ కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం మంగళగిరి పట్టణ ఎస్ఐ ఎస్ కె ఖాదర్ బాషా ఆధ్వర్యంలో సిబ్బంది హెడ్ కాని స్టేబుళ్లు రాజు, జాకీర్ హుస్సేన్... కానిస్టేబుల్స్ టి ప్రవీణ్ కుమార్, వెంకటేశ్వర్లు దాడి చేసి వారిని అదుపులో తీసు కున్నారు .కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆత్మకూరు గ్రామ పరిధిలోని టేకు తోట ఏరియాలో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, ప్రొబేషనరీ డి.ఎస్.పి గారైన భార్గవి, సిబ్బంది కలసి దాడి చేశారు. ఏడుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.1510 నగదు, నాలుగు సెల్ఫోన్లను, ఒక మోటార్ సైకిల్ ను సీజ్ చేశారు. ఏడుగురును అదుపులోనికి తీసుకుని వారిపై కేసు నమోదు చేసిన తర్వాత కోర్టు ముందు హాజరు పరిచినట్లు తెలిపారు. మండల పరిధిలో పేకాట, కోడిపందేలు, ఇతర జూదాలు అదేవిధంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వయనాడ్ వరద బాధితుల కోసం విరాళాలు

ప్రజాశక్తి -నాదెండ్ల

కేరళలోని వయనాడ్ వరద బాధితులను ఆదుకునే నిమిత్తం నాదెండ్ల ఐద్వా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విరాళాలను సేకరించారు. బండ్ల కాంతారావు ఆధ్వర్యంలో దేశభక్తులను స్మరించుకుంటూ కళాకారులు పాటలను ఆల పించారు. నల్లమోతు రఘు రామయ్య, తోకల కోటేశ్వర రావు, గొట్టిపాటి రామారావు,నూతలపాటి కాళి దాసు తది తరులు పాల్గొన్నారు. మహిళా సంఘాల ఆధ్వ ర్యంలో విరా ళాలు సేకరించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపి శ్రీకృష్ణదేవరాయలు, బాలోత్సవాల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు

'మాతృభాష నా శ్వాస' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రతి ఒక్కరూ మాత భాషకు ప్రాధాన్యత ఇవ్వాలని మాత భాషను పుట్టి పెరిగిన ప్రాంతాన్ని మరువరాదని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవ రాయలు అన్నారు. నరసరావుపేటకు చెందిన ప్రముఖ పద్య కవి ఈవూరి వెంకట రెడ్డి తెలుగు భాషపై సాహిత్యం పై తనకున్న అభిమానంతో పలు సందర్భాలలో పలువురు కవులపై వారి కవిత్వంపై, వారి కవిత రీతులపై ప్రస్తుతం ఉన్న తెలుగు భాష ఉన్న స్థితిగతులను తెలుగు భాష గొప్పతనాన్ని చాటుతూ అనేక విషయాలను ప్రస్తావించారు. తెలుగువారి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటుతూ రచించిన 'మాతృభాష నా శ్వాస' పుస్తకాన్ని ఎంపి ఆది వారం పార్ల మెంట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని లావు రత్తయ్యకు అంకితం చేస్తున్నట్లు వెంకటరెడ్డి చెప్పారు. పుస్తక ప్రచురణకు ఆర్థిక సహాయం అంద జేసిన ఆక్స్ ఫర్డ్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ సిహెచ్ రాజగోపాల్ రెడ్డి(రాజారెడ్డి)కి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పల్నాడు బాలోత్సవాల కార్య దర్శి కట్టా కోటేశ్వరరావు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.



మగ్నస్‌ను అభినందిస్తున్న చిత్రం

మాచర్ల చిన్నారి ప్రతిభ.. జాతీయ స్థాయి చెస్ పోటీలకు మగ్నస్

ప్రజాశక్తి-మాచర్ల

ఈ నెల 3 నుండి 4 వరకు విజయనగరం జిల్లా లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ -7 చెస్ పోటీలలో మాచర్ల చిన్నారి జోషువా మగ్నస్ అత్యంత ప్రతిభ కనబరిచాడు. ఈ పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుండి సుమారు 90 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఐదేళ్ల వయసున్న జోషువా మగ్నస్ అత్యంత ప్రతిభ కనపరచి రెండవ స్థానం సాధిం చడంతో సెప్టెంబర్‌లో జరగనున్న జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు పట్టణంలోని పల్నాడు చెస్ అకా డమీ కోచ్ కిరణ్ ఆదివారం తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మగ్నస్‌ను అభినందించారు.

పారిశుద్ధ్యం మెరుగు పడేదెప్పుడో!

- పట్టణం, పల్లెల్లో, పేదలవాడల్లో పారని మురుగు
- ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు
- విజృంభిస్తున్న దోమలు
- సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పారిశుధ్యం మెరుగ్గా లేక, మురుగునీరు పారుదల సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో పట్టణ ప్రజలు, పల్లె వాసులు రోగాల బారినపడుతున్నారు. ఈ వానాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు పట్టణ, పల్లెల్లో ప్రజలు, ముఖ్యంగా స్లమ్ ప్రాంత వాసు లను వణికిస్తున్నాయి. ఈ రోగాల బారిన పడుతున్న వారు ఎక్కువగా రోజువారీ కూలీలు, మధ్య తరగతి ప్రజలు, చిన్న పిల్లలు, పాఠ శాల విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంది. జలుబు దగ్గు, జ్వరాలు,వైరల్ ఫీవర్లు,మలేరియా, డెంగీ, పసికర్లు, ఊపిరి తిత్తుల సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. రోజు వారీ కూలీలు ఈ వ్యాధుల బారినపడటంతో జీవనో పాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు.



తహశీల్దార్ కార్యాలయం, ఆర్.డ బ్ల్యూఎస్ కార్యాలయం,ఎం.డి.ఓ. కార్యాలయం మధ్యలో పిచ్చి మొక్కలతో,పాములు, మురుగు నీరు,దోమలతో ఊరి మధ్యలో ఉన్న తపాల శాఖ స్థలం



రాగన్నపాలెంలో ఇళ్ల మధ్య పిచ్చి మొక్కలు

పట్టణంలో, పల్లెల్లో ఎక్కడ పడితే పేరుకుపోతున్న చెత్తాచెదారం, మురుగు నీరు పారక పోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. సంబంధిత శాఖ వారు దోమల నివారణ కు చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ప్రజా ఆరోగ్య సంక్షేమానికి లక్షలు ఖర్చులు చేస్తున్నట్లు లెక్కలు మాత్రం పొల్లు పోకుండా అధికారులు చూపుతుండటం గమనార్హం. జ్వరాల బారినపడి వాటిల్లో కొన్ని డెంగీ కేసు లుగా మారుతున్నాయి. డెంగీ, మలేరియా ఎలీషా పరీక్షల ద్వారా ని ర్ధారణ చేస్తారు. ఈ పరీక్షా కేంద్రాలు ప్రస్తుతానికి నరసరావుపేటలోని లింగంగుంట్ల వద్ద, గుంటూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో మాత్రమే ఉన్నాయి. స్థానికంగా నాన్ స్ట్రెచ్యులర్ ప్రోటీన్ పరీక్షలు నిర్వ హిస్తున్నప్పటికీ అవి కచ్చితంగా ఉండవనే తెలుస్తోంది. ఒకొక్క మారు పాజిటివ్ అయినా కూడా మలేరియ, డెంగీ జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయంటున్నారు. ఇక, దోమల బారిన పడకుండా ఉండేందుకు వినియోగించే మస్కిటో కడ్డీ ధర గతంలో రూ.8 నుంచి రూ.10 వరకు అమ్మేవారు. ప్రస్తు తం రూ. 15 కు విక్రయిస్తున్నారు. దోమ తెర ధరల పరి స్థితి అదే మాదిరిగా ఉంది. గతంలో రూ.150కు విక్ర యించిన దోమ తెర ధర



మురుగ కాల్వలో తాగునీటి పైపు

ప్రస్తుతం రూ.250, రూ.300 గా అమ్ము తున్నారు. మస్కిటో బ్యాట్ ఒక్కొక్క దాని ధర రూ. 250 ఉండగా, ప్రస్తుతం దీని ధర రూ. 500/600గా ఉందని వినియోగదారులు చెబుతున్నారు. వీటి ధరలపై ఎక్కడా నియంత్రణ లేదు. దోమల నివారణ నకిలీ మందులు విక్రయిస్తున్న దాఖలాలు లేకపోవలేదు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి నీటి కుంటలు ఏర్పడి తద్వారా దోమలు, దుర్వాసన విపరీతంగా వస్తున్నాయ ని అట్లా ఖాళీగా ఉన్న



సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో..



ఎమ్మెల్సి మర్రి రాజశేఖర్ ఇంటికి వెళ్లే దారి పక్కనున్న మురుగు కాల్వ

స్థలాల వారికి గ్రామ పంచాయతీలు గాని, మున్సి పాలిటీ వారు నోటీసులు ఇచ్చిన దాఖలాలు ఎక్కడా లేవు. వారికి నోటీ సులు ఇచ్చి పిచ్చి చెట్లను తొలగించి, మురుగునీరు పా రు సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి.


అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆయా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరు తున్నారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా స్లమ్ ప్రాంతాల్లో ,పల్లెల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు, వైద్య శిబిరాలు నిర్వ హించాలని. గ్రామ, పట్టణ వార్డులో బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణ మందులు చల్లాలని పట్టణాలలో మురుగు కాల్వలలో పూడిక తీయాలని, తాగునీటి పైపు లన్ని కాల్వల ద్వారా వేయకుండా, చెత్తాచెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజా శ్రేయస్సు దృష్ట్యా వైద్య ఆరోగ్య గ్రామ పంచాయతిల శాఖ లన్నీ కలిసి కట్టుగా పని చేయాలని, వైద్య ఖర్చుల బారిన పడి చితికిపోతున్న కుటుంబాలకు భరోసా కల్పించాలి.

పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో

నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో పట్టణంలోని సాంబశివపేట నేషనల్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం నిర్వ హించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభిం చింది. ఈ వైద్య శిబిరాన్ని పల్నాడు బాలోత్సవాల కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు ప్రారంభించి, కార్యక్రమ నిర్వహణకు



మొక్కలు పంపిణీ చేస్తున్న గద్దె చలమయ్య

అధ్యక్షత వహించారు. వైద్య శిబిరంలో 170 మందికి పైగా రోగులకు నెల్లూరి హాస్పిటల్ అధినేత డాక్టర్ నెల్లూరి రమేష్ బిపి, షుగర్, జలుబు, దగ్గు, జ్వరం, నరాల వ్యాధు లకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కల పంపిణీ కార్య క్రమాన్ని పల్నాడు విజ్ఞాన కేంద్రం భవన నిర్మాణ కమిటీ కన్వీనర్ గద్దె చలమయ్య, డాక్టర్ నెల్లూరి రమేష్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులతో కలిసి పంపిణీ చేశారు.

మొక్కలు సంరక్షించిన వారికి ఉచిత ఒపి, మందులు, వైద్య పరీక్షల్లో రాయితీ డాక్టర్ నెల్లూరి రమేష్

నెల్లూరి సూపర్ హాస్పిటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన మొక్కలను ప్రతి ఒక్కరూ సంరక్షించాలని డాక్టర్ నెల్లూరి రమేష్ కోరారు తాము పంపిణీ చేసిన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నెల్లూరి రమేష్

మొక్కలను సంరక్షిస్తూ ఏదైనా అనారోగ్య సమయంలో సంరక్షించిన మొక్క ఫొటోతో వస్తే తమ హాస్పిటల్ లో ఉచిత ఓపితో పాటు మందులలో 10 శాతం, వైద్య పరీక్షలలో 30 శాతం రాయితీలు కల్పిస్తామన్నారు. వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందించిన డాక్టర్ నెల్లూరి రమేష్ ను పల్నాడు విజ్ఞాన కేంద్రం కన్వీనర్ షేక్ మస్తాన్ వలి సత్కరించారు. పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, సభ్యులు కె. రామారావు, బి.నాగేశ్వరరావు,సిలార్ మసూద్, ఆంజనేయ నాయక్, నేషనల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ చాంద్ బాషా, ప్రిన్సిపల్ షేక్ అమీనాబి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గుంటూరు 5
సోమవారం 5 ఆగస్టు 2024

మంత్రి ఇలాకాలో సిఆర్‌డిఎ కార్యాలయం అస్తవ్యస్తం

- పేరుకే అధికారులు - ఖాళీగా కుర్చీలు
- అందుబాటులో ఉండని ఉన్నతాధికారి
- మురికి కూపంలా కార్యాలయం
- ఎసిబి దాడి జరిగినా మార్పులేమి

ప్రజాశక్తి-తెనాలి

గతంలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఉడా) కార్యాలయం 2014లో అప్పటి ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధానిగా ప్రకటించటంతో సిఆర్‌డిఎ కార్యాలయంగా మారింది. కార్యాలయంలో జోనల్ డిప్యూటీ డైరెక్టర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, ఇరువురు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లతో పాటు సచివాలయ ఉద్యోగి, తాత్కాలిక అంటెడర్ సిబ్బందిగా ఉన్నారు. కాని ఏ ఒక్కరూ ఏ రోజు కూడా కార్యాలయంలో దర్శనమివ్వరు. అదేమంటే ఫీల్డ్ విజిట్‌గానో, సిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ, సబ్ డివిజన్ కార్యాలయంలో అదనపు బాధ్యతలుగా చెబుతారు. ఇక జోనల్ డిప్యూటీ డైరెక్టర్ ధర్మారావు విషయానికి వస్తే ఉదయం 10.30కి కచ్చితంగా కార్యాలయానికి రావటం, హాజరు నమోదు చేసి పత్తాలేకుండా వెళ్లి పోవటం అతని దినచర్య. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ గౌతంబాబు ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ, తెనాలి సబ్ డివిజన్ కార్యాలయంలో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఏదైనా ఫీల్డ్ విజిట్ ఉంటే తప్ప కార్యాలయానికి దాదాపుగా రారు. మరో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ కేశవరావు విషయానికి వస్తే 2022 డిసింబర్ ఆరున తెనాలి కార్యాలయానికి వచ్చారు. కొత్త జిల్లాలు ఏర్పడిన తరుణంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద వేమూరు, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల పరిధిలో పనిచేసేవారు. తెనాలి సిఆర్‌డిఎ సబ్ డివిజన్ కార్యాలయానికి వచ్చిన తరువాత ఇప్పటి వరకూ ఆయనకు ఎలాంటి విధులూ కేటాయించలేదని, రెండేళ్లుగా కార్యాలయానికి రావటం, వెళ్లడమే పనని, నెలరోజుల్లో ఉద్యోగ విరమణ చేయనున్నట్లు ఆయనే స్వయంగా వెల్లడించటం కొసమెరుపు. పైగా విధులు కేటాయించాలని సిఆర్‌డిఎ ఉన్నతాధికారులను లిఖితపూర్వకంగా కోరినా అధికారులు పట్టించుకోలేదన్నది సారాశం.


పాత సమాచారంతో ఉన్న బోర్డు


కార్యాలయంలో టేబుల్‌పై గ్లాసులు, సోడా

మురికి కూపంలా కార్యాలయం..

టేబిల్‌పై సోడాలు, గ్లాసులు

అధికారుల తీరు ఇలా ఉంటే కార్యాలయం మురికి కూపమే. ఎక్కడ చూసినా దుమ్మూధూళి. చిందరవందరగా ఫైళ్లు, చెత్తా చెదారంతో నిండిపోయింది. ఉడా కార్యాలయంగా ఉన్నప్పుడు ఉన్న బోర్డులను కూడా తొలగించే తీరిక కూడా అధికారులకు లేదు. పైగా కార్యాలయంలో టేబుల్ పరిశీలిస్తే అక్కడే గ్లాసులు, సోడాలు దర్శనమిచ్చాయి. దీంతో అక్కడ ఏం జరుగుతుందన్నది ఇట్టే స్పష్టమౌతోంది. కార్యాలయానికి సంబంధించిన బోర్డుగాని, ప్రభుత్వ కార్యాలయం ఆనవాళ్లు కాని కనిపించటం లేదు. ఏదో పాడుబడిన ఇంటిలా కార్యాలయం ఉంది. ఇటీవల ఈ కార్యాలయంలో ఎసిబి దాడులు నిర్వహించి, లంచం తీసుకుంటున్న ఇద్దరు సిబ్బందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవటంతో సిఆర్‌డిఎ సబ్ డివిజన్ కార్యాలయం ఉందన్న సంగతి వెలుగులోకి వచ్చింది. ఎసిబి దాడులు జరిగినా పరిస్థితిలో ఎలాంటి మార్పూ లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పరిస్థితులను చక్కదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వాస్క్యులర్ డే సందర్భంగా వాకథాన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జాతీయ వాస్క్యులర్ డే సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియం నుండి మదర్ థెరిసా కూడలి వరకు ఆదివారం వాకథాన్ నిర్వహి ంచగా ఎమ్మెల్యే గళ్లా మాధవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తనాళాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ రోజు కొంత సమయం వ్యాయామం చేయాలని సూచిం చారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మీ మాట్లాడుతూ రక్త ప్రసరణ చాలా ముఖ్యమైనదని, ఏదైనా అవయవాల్లో నల్లటి మచ్చలు కనిపిస్తే వాస్క్యులర్ వైద్యులను సంప్రదించాలని సూచించారు. గుంటూరు ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ నూతక్కి శ్రీనివాస్‌రావు, వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ తరపున డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ మధుమేహం ఉండి ఒంటి మీద ఏదైనా నల్లటి మచ్చలు కనబడితే వైద్యులను సంప్రదించాలన్నారు. రక్తనాళాల్లో ఇబ్బందుల వలన రక్త ప్రసరణ సరిగ్గా లేకపోవడం వల్ల ఎన్నో ఇబ్బందులు వస్తాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్‌రెడ్డి తుపాకుల, సురేంద్ర నాగులపాటి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు

ప్రజాశక్తి-తాడేపల్లి



తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఫాస్ట్ గవర్నర్ అన్నపరెడ్డి కోటిరెడ్డి, అడాబ్షన్ జిల్లా చైర్మన్ జోజప్ప స్టడీ సర్కిల్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఇష్టపడి చదివి శ్రమను ఆయుధం చేసుకుంటే విజయం సొంతమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.తాతిరెడ్డి, ఉపాధ్యాయులు ఎస్‌కె అన్వర్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



10న చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి-తాడేపల్లి

స్థానిక ఆశ్రమం రోడ్డులోని అమరావతి ఐకాన్‌లో ఈ నెల పదో తేదీన జరుగుతున్న చిత్రలేఖనం పోటీల ద్వారా బాలబాలికల్లో పట్టుదలతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందని బాలోత్సవాల రాష్ట్ర బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ చెప్పారు. చిత్రలేఖనం పోటీలకు సంబం ధించి బ్రోచర్‌ను అమరావతి క్లబ్‌హౌస్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీ కృష్ణ మాట్లాడుతూ బాలల అభివృద్ధి విషయమై కేంద్రీకరణే లక్ష్యంగా మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం పని చేస్తుందని చెప్పారు. పిల్లల మనసుకు, మెదడుకు పదును పెట్టడంతో పాటు ఒకే అంశంపై దృష్టి పెట్టడం, కష్టపడటం చిత్రలేఖనం ద్వారా సాధ్యమవుతుందని వివరించారు. సెల్‌ఫోన్, టీవీల నుంచి దృష్టి మళ్లించడానికి, శక్తియుక్తులు బయటకు తీయడానికి పోటీలు దోహదం చేస్తాయన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలు, ఆ త్యాగాల ద్వారా సిద్ధించిన ఫలాలు నేడు మనం అనుభవిస్తున్న తీరు యువతరానికి తెలియజెప్పడమే ముఖ్య ఉద్దేశమని చెప్పారు. తాడేపల్లి రోటరీ క్లబ్ అధ్యక్షులు, మంగళగిరి సిటీ కేబుల్ ఎమ్‌డి రావూరి రమేష్‌బాబు మాట్లాడుతూ ఎమ్‌టిఎంసి ఆధ్వర్యంలో జరిగే చిత్రలేఖనం పోటీలను జయప్రదం చేయాలని కోరారు. పాల్గొన్న ప్రతిఒక్కరికీ సర్టిఫికెట్లు ఇవ్వడంతో పాటు విజేతలకు బహుమతులు అందజేయ నున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సాయంత్రం 4 గంటలకు జరిగే సభలో తల్లిదండ్రులు, విద్యార్థులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి జెవి రావు, విశ్రాంత లెక్చరర్ స్వాములు, బాలోత్సవం ప్రతినిధులు గాదె సుబ్బారెడ్డి, వై.సుబ్బారావు, ఎం.సంధ్యారాణి, వై.సుధ, బిట్రా రామారావు, ఎం.మనోహర్‌రెడ్డి, సురేంద్ర పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును హర్షిస్తూ మండల కేంద్రమైన పెదనందిపాడులో ఆదివారం ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. స్థానిక పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమా లలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ కన్వీనర్ తోడేటి యేసుపాదం, కారుమూరి అంకయ్య మాదిగ, పి.పాపారావు, వి.కైసర్, కె.సునీత, కె.రమేష్ మాట్లాడారు.


గ్రంథాలయానికి పుస్తకాలు వితరణిస్తున్న ఉమామహేశ్వర్, నవ్య

నైతిక విలువలు, విచక్షణ పుస్తక పఠనం ద్వారా సాధ్యం

ప్రజాశక్తి - తెనాలి

అభివృద్ధి చెందిన దేశాల్లో గ్రంథాలయాలకు అత్యధిక ప్రాధాన్యముందని, పుస్తక పఠనం ద్వారానే నైతిక విలువలు, విచక్షణా జ్ఞానం సాధ్యమని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ అన్నారు. తన తండ్రి వేజళ్ల వెంకట సుబ్బారావు స్మారకంగా ఏర్పాటు చేసిన విద్యా ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్తపేట మహిళా బాలల గ్రంథాలయానికి ట్రస్ట్ సభ్యులు వేజళ్ల నవ్య పుస్తకాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర్ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా మానసిక వికాసంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయన్నారు. నవ్య మాట్లాడుతూ ఆధునిక విజ్ఞానం పెరిగిన తర్వాత గ్రంథాలయాల్లో పుస్తక పఠనం తగ్గిందని, అందరూ సెల్‌ఫోన్లలోనే మునిగి పోతున్నారని అన్నారు. తెలుగు భాష కూడా కనుమరుగు అయ్యే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వెలిబుచ్చారు. పాఠశాల దశ నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. ట్రస్టు ద్వారా ప్రతి సంవత్సరం విలువైన పుస్తకాలను పాఠశాలల గ్రంథాలయాలకు, స్థానిక ప్రభుత్వ గ్రంథాలయాలకు బహూకరిస్తున్నామని చెప్పారు. దాతలకు గ్రంథాలయ అధికారి కోడూరి అంజని కృతజ్ఞతలు తెలిపారు.


అవయవ దానం మహత్తర ఆశయం

ప్రజాశక్తి-గుంటూరు

అవయవ దానం ఒక మహత్తర ఆశయమని, అవయవ దానం చేయడం ద్వారా ఎంతో మందికి ప్రాణదానం చేసి, నూతన జీవితాన్ని అందించవచ్చని అవగాహన సంస్థ సభ్యులు తెలిపారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో 'అవయవదానంపై అవగామన కార్యక్ర మంలో నిర్వహించారు. ప్రముఖ యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలతోనో, ఎదురు చూడని ప్రమాదాలతోనో చనిపోయిన వారి మొత్తం శరీరాన్ని, మొత్తం అవయవాలను దానం చేయవచ్చని, అలా చేసిన వారు చనిపోయిన తర్వాత కూడా మరికొంతమందిలో కొన్నేళ్ల పాటు బతికే ఉంటారని అన్నారు. అవయవ దానానికి వయ స్సుతో సంబంధం లేదని గుండె, మూత్ర పిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు, క్లోమగ్రంధి వంటి అవయవాలు దెబ్బతిన్న వారు మరణానికి చేరువ అవుతూ శారీరకంగా ఆర్థికంగా చిదిగిపోతూ ఉంటారన్నారు. ఇటువంటి పరిస్థితి ఉన్న వారికి అవయవ మార్పిడి పునర్జన్మను ఇస్తుందన్నారు. కార్యక్రమంలో అవయవదాన ప్రచారకులు పి.భావన్నారాయణ, విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, ఇంజనీర్ సదాశివం, సంస్థ సీనియర్ సభ్యులు పి.జనార్ధనరావు పాల్గొన్నారు.

అక్రమార్కులను అధికారులుగా నియమించొద్దు

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగంలో అక్రమాల చరిత్ర ఉన్న అధికారులను తిరిగి నియమించొద్దని ఏపీ టీచర్ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ నాయకులు టి.సాల్మన్, బి.రాజు మాదిగ ఒక ప్రకటనలో కోరారు. ఎగ్జామినర్ల నియామకంలో లక్షలాది రూపాయలు వసూలు చేసిన వారిని, వైవా సిట్టింగ్‌ల చార్జీల పేరిట వేలాది రూపాయలు దండుకున్న వారిని అధికారులుగా నియమిస్తే ఊరుకోబోమని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకొని అడ్డుకోవాలని, వర్సిటీ ఎడ్యుకేషన్ విభాగాన్ని అవినీతిమయంగా మార్చిన వారిపై విచారణ జరపాలని కోరారు.



కరుణశ్రీకి నివాళి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మండల పరిధిలోని పసుమర్రులోని రాజేష్ మాస్టారు ప్రయివేట్ పాఠశాలలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి 112వ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ సాహితీవేత్త డాక్టరు పివి సుబ్బారావు, కరుణశ్రీ కావ్యాలు, పద్యాల గురించి విద్యార్థులకు వివరించారు. లలిత సుగుణ జాల తెలుగు బాల శతకంలోని పద్యాలను పాడి వినిపించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులు దార్ల బుజ్జి బాబు, చిలకలూరిపేట డివిజన్ ఉపాధ్యక్షులు ఉన్నవ రాజేష్, బిజెపి ఒబిసి మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి అధిమూలం గురుస్వామి పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల సర్దుబాటు మండల పరిధిలో మాన్యువల్ గా చేయండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఉపాధ్యాయుల సర్దుబాటు మండల స్థాయిలో చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కా ర్యదర్శి కె కోటేశ్వరరావు, ఎ స్టీయూ రాష్ట్ర డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గల ఎస్టీయూ ప్రాంతీయ కార్యా లయంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏకోపాధ్యాయ పాఠశాలలు లేకుండా ఉపాధ్యాయులను సర్దు బాటు చేయాలని కోరామన్నారు. ఆరు వేలకు పైగా వున్న స్కూల్ అసిస్టెంట్ ఖాళీలలో వెంటనే పదోన్న తులు కల్పించాలని డిమాండ్ చేశామన్నారు. విద్యారంగ, ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలపై ఈ స మావేశంలో చర్చించామన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు,పాఠశా ల విద్యలో సమాంతరంగా ఇంగ్లీష్ , తెలుగు మీడియంలను కొనసాగించాలని కోరినట్లు చెప్పారు. మున్సిప ల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరామన్నారు.12 వ పీఆర్సీ కమిషన్ ఛైర్మన్ నియామకం చేసి,ఐ.ఆర్ వెంటనే ప్రకటించాలని కోరామన్నారు. కస్తూర్బా స్కూల్ ఉపాధ్యాయులకు కనీస వేతన చట్టం(ఎం.టి.ఎస్.)అమలు చేయాలని ,ఆదర్శ పాఠశాలల,ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వం మారి రెండు నెలలు అయినా ఇంకా ఉపాధ్యాయుల పై యాప్‌ల అదనపు భారం తగ్గించలేదన్నారు. యాప్ లనూ రద్దుచేసి ఉ పాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరామన్నారు. సమావేశంలో ఎస్టీయూ పల్నాడు జిల్లా కా ర్యదర్శి వినుకొండ అక్కయ్య,ఎస్టీ యూ పట్టణ అధ్యక్షులు మేకల కోటే శ్వరరావు కార్యదర్శి వడ్లన జయప్ర కాష్, చిలకలూరిపేట మండల అధ్య క్షులు బొంతా రవికుమార్,ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ వలి.యడ్లపాడు మండలం అధ్యక్షులు జీ,కోటేశ్వరరా వు.ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ నాదెండ్ల మండల అధ్యక్షులు షేక్ మక్బుల్ బాషా, ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్ ఎస్టీయూ సీనియర్ నాయకులు చావలి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులపై నేతల కన్ను

ప్రజాశక్తి -పెదకూరపాడు

పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులలో గుర్తింపు, గౌరవం ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా ప్రకటించారు. దీంతో టిడిపి కూటమి నేతల కన్ను నామినేటెడ్ పదవులపై పడింది. ఇప్పటికే వైసిపి నాయకులు చాలామంది తాము మొన్నటి వరకు అనుభవించిన నామినేటెడ్ పదవులకు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఒకరిద్దరూ కుర్చీలను పట్టుకొని వేలాడుతున్న ప్రభుత్వం జారీ చేసే జీవోతో వారి పదవులు ఊడతాయని చర్చ నడుస్తుంది. కీలక కుర్చీలపై కన్నేసిన ద్వితీయ శ్రేణి నాయకులు ఒక అవకాశం ఇవ్వాలంటూ ఎవరికి వారు ఎమ్మెల్యే, ఎంపీ లను కలిసి సిఫారసు లేఖలు తీసుకునేందుకు ప్రయ త్నాలు చేస్తున్నారు. పెదకూరపాడు నియోజక వర్గంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ క్రోసూరులో ఉంది. ఈ పదవి వైసీపీలో తొలుత అమరావతి మండలం మల్లాదికి చెందిన వెంప జ్వాల నరసింహారావు రెండున్నరేళ్లు, పెదకూరపాడు మండలం తాళ్లూరుకి చెందిన ఈదా సాంబిరెడ్డి సగం కాలం పనిచేశారు. ప్రభుత్వం మారడంతో ఆయన రాజీనామా చేశారు. 2014లో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో క్రోసూరు మండలంలోని ఉయ్యందనకి చెందిన వేపూరి నాగేశ్వరరావుకు అవకాశం ఇచ్చారు. ఈ పదవి కోసం ప్రస్తుతం పలువురు తీవ్రంగా ప్రయ త్నిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 8 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి.

పెదకూరపాడు మండలం లోని తాళ్లూరు సంఘం, అమరావతి మండ లంలో మూడు సంఘాలు, క్రోసూరులో, అచ్చంపేట మండ లంలో కలిపి మూడు సంఘాలు, బెల్లంకొండ మండ లంలో ఒక పరపతి సంఘం ఉన్నాయి. వైసిపి ప్రభు త్వంలో ఈ సంఘాలకు త్రీ మెన్ కమిటీలతో ఐదు ఏళ్లు నడిపించింది. ఆలయాల కమిటీలలో కీలక పదవు లతో దేవుడికి సేవతోపాటు సంఘంలో పరపతి పెంచు కోవ చ్చని నాయకుల్లో ఓ భావన ఉంది. అమరావతి అమరేశ్వర స్వామి నియోజకవర్గంలో ప్రసిద్ధిగాంచినది. ప్రభుత్వ ఆసుపత్రులు అభివృద్ధి కమిటీలు, ప్రభుత్వ పాఠశాల నిర్వహణలో తల్లిదండ్రుల కమిటీలు స్థానిక పద వులపై ముఖ్య నాయకులు కన్ను వేశారు.

పదవులు ఎంపిక కత్తి మీద సాము!

నామినేటెడ్ పదవుల ఎంపిక అధికార పార్టీకి కత్తి మీద సాము అయ్యే అవకాశం ఉంది. సార్వత్రిక ఎన్నికల ముందు వైసిపితో విభేదించిన వారు టిడిపి, జనసేన, బిజెపిలో చేరారు. వీరు కూడా పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

గ్రామాలలో తెలుగుదేశం పార్టీకి బలమైన కేడర్ ఉంది.పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి పునాదిగా బీసీలు ఉన్నారు. వీరు కూడా నియోజకవర్గ స్థాయి పదవులు ఆశిస్తున్నారు. ఎన్నికల ముందు పార్టీలో చేరిన వారికి పదవులు ఇవ్వాలా, ప్రాధాన్యత ఇవ్వాలా, వైసిపి దాడులకు తట్టుకొని నష్టాలు కష్టాలు చవి చూసిన వారికి ప్రాధాన్యత ఇస్తారా అనేది వేచి చూడాల్సిందే.

రాజకీయ లబ్ధి కోసం గొడవలు సృష్టిస్తే సహించం

మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుకు ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు హెచ్చరిక

ప్రజాశక్తి- వినుకొండ

రాజకీయ లబ్ధి కోసం మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు గ్రామాల్లో గొడవలు సృష్టించి, అసత్యారోపణలతో శవ రాజకీయాలు చేస్తే సహించేది లేదని చట్టపరమైన చర్యలు తప్పవని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హెచ్చరించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శవాలు చూడందే జగన్‌కు, గ్రామాల్లో తగాదాలు రెచ్చగొట్టందే బ్రహ్మనాయుడుకు నిద్ర రాదని విమర్శించారు. ఏనుగుపాలెంలో మహిళ దేవి గత మే నెలలో మృతి చెందిందని అన్నారు. ఆపద్ధర్మ ప్రతినిధులుగా పాలిస్తూ ఏమి చేశారని బొల్లాను ప్రశ్నించారు. నాడు ప్రతిపక్షంలో ఉండి తాము సిఐని ప్రశ్నించి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారని, ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్ట్ రాగానే చర్యలు తీసుకుంటామని పోలీసులు వివరించినట్లు చెప్పారు. ఒకవైపు కేసు విచారణలో ఉండగానే బ్రహ్మనాయుడు టిడిపిపై బురదజల్లుతూ అసత్య ప్రచారాలు చేయడం తగదని హెచ్చరించారు. జిలాని, రషీద్ ఇద్దరూ వ్యక్తిగత కక్షల నేపథ్యంలో హత్య జరిగితే అన్ని తెలిసి రాజకీయ లబ్ధి కోసం జగన్మోహన్ రెడ్డి,



బ్రహ్మనాయుడు రాజకీయరంగు పులమడం దుర్మార్గమన్నారు. వేల్పూరులో గొడవలు జరగకుండా పోలీసులు పికెట్ ఏర్పాటు చేసి భద్రత కల్పిస్తే బొల్లాకు వచ్చిన నష్టం ఏంటని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ బ్రహ్మనాయుడు అధికారం పోయిందనే అక్కసుతో మాట్లాడడం సబబు కాదన్నారు. వైసిపి హయాంలో ప్రతి గ్రామంలో దొంగ పెన్షన్లు ఉన్నాయని నిరూపించేందుకు తాను సిద్ధమని అన్నారు. వేల్పూర్ లో ఎన్నడూ లేని ఘర్షణ వాతావరణం తన సొంత గ్రామంలో బ్రహ్మనాయుడు తీసుకువచ్చి అనేక మంది అమాయకులను అరెస్టు చేయించడం, గిట్టుబాటు ధర అడిగిన రైతుపై చెప్పుతో దాడి చేసిన నీచ చరిత్ర ఆయనదని విమర్శించారు. బ్రహ్మనాయుడు చేసిన భూకబ్జాలు అన్ని ఎన్డీఏ ప్రభుత్వంలో వెలికి తీసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

వైభవంగా రేణుక అంకమ్మ తల్లి వార్షికోత్సవం

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండల పరిధిలోని బుచ్చియ్యపాలెంలో రేణుక అంకమ్మ తల్లి వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. ముందుగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కు కోలాటంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పరుచూరి



నాని, సర్పంచి కె. వీర సింహం, మాజీ సర్పంచి పి.పూర్ణ చంద్రరావు, మండల టిడిపి అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్,గల్లా బాబురావు, బెల్లంకొండ గోపాలరావు, భాష్యం ఆంజనేయులు రేణుక అంకమ్మ తల్లి ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు. 10 వేల మందికి సందర్శకులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.





తురిమెళ్లలో ప్రజలతో మాట్లాడుతున్న సిఐ, ఎస్ఐలు, సత్తెనపల్లిలో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న పట్టణ సిఐ శ్రీనివాసరావు

గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి కృషి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట రూరల్ పరిధి రొంపిచర్ల మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన అలవాల, తురిమెళ్ల గ్రామాల్లో రూరల్ సిఐ పసుపులేటి రామకృష్ణ, రొంపిచర్ల ఎస్.ఐ కెపి రవీంద్ర ఆదివారం పర్యటించారు. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణ నెలకొల్పేందుకు పోలీసు శాఖ చేస్తున్న కృషికి గ్రామీణ ప్రాంత ప్రజలు సహకరించాలని కోరారు. గ్రామాలలో వివాదాలు సృష్టిస్తే ఎంతటి వారైనా సరే వదిలిపెట్టేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా గ్రామాల్లో పాత కేసుల్లో ఉన్న నిందితుల కదలికలు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రౌడీ షీటర్స్‌పై ఉక్కు పాదం మోపుతామన్నారు. ఇరు పార్టీ నాయకులు ఏదైనా గొడవలు తలెత్తితే నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలే తప్ప చట్టాన్ని వారి చేతిలోకి తీసుకొని ఘర్ష ణలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చ రించారు. సమస్యాత్మక గ్రామాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకు వెళ్ళటం ఖాయమని పట్టణ సిఐ పి.శీనివాసరావు అన్నారు .సత్తెనపల్లి పట్టణ పోలీసులు ఆటో, కార్ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. మైనార్టీలకు వాహనాలు ఇస్తే తలిదండ్రులు పై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఎస్ఐ సంధ్యారాణి పాల్గొన్నారు.

భూసేకరణ నుంచి గృహనిర్మాణం వరకూ అక్రమాలే

- సొమ్ములు కాజేసిన కాంట్రాక్టర్లు లబ్ధిదారులకు టోకరా
- అధికారుల వైఖరిపై మంత్రి మనోహర్ తీవ్ర అసహనం
- వైఫల్యాలను కొద్దిరోజుల్లో సరిచేస్తామని ప్రకటన

ప్రజాశక్తి-తెనాలి

అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది.. నిర్మాణాల్లో నాణ్యతా లోపం స్పష్టమవుతోంది.. ఇంటి నిర్మాణంలో పేదలకు ఓ పద్ధతి, పెద్దలకు ఓ పద్ధతి ఎందుకు అమలైంది? నిర్మాణాల్లో అవకతవకలు జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు? అంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ వైఫల్యాలను కొద్దిరోజుల్లో సరిచేస్తామని, పేదలను మోసం చేసిన కాంట్రాక్టర్లపైనా చర్యలు తప్పవని అన్నారు. జగనన్న కాలనీల్లో స్థలాల కేటాయింపు, గృహనిర్మాణాలపై ప్రజల నుంచి ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన లబ్ధిదారులతో సదస్సును ఏర్పాటు చేశారు. దానిలో భాగంగా పెదరావూరు, సిరిపురంలో జగనన్న కాలనీలను అధికార బృందంతో కలిసి ఆదివారం పరిశీలించగా లబ్ధిదారులు అనేక సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్మును తీసుకున్న కాంట్రాక్టర్లు



ఇల్లు అమ్మబడును అంటూ జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన బోర్డు

గృహనిర్మాణాన్ని బేస్‌మెంట్‌తోనే సరిపెట్టారని, అప్పులు చేసి ఇచ్చిన సొమ్ముకు కాంట్రాక్టర్ నుంచి కనీస సమాధానం కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాటు కేటాయించినట్లు పత్రాలిచ్చినా ఎక్కడుందో చూపడం లేదని కొందరన్నారు. అర్హతున్నా తమకు ప్లాట్ రాలేదని, తొలుత అర్హుల జాబితాలో పేరు చూపించి, తర్వాత తొలగించారని, కాలనీలో గంజాయి సేవించిన యువకుల సంచారం ఎక్కువగా ఉందని, భయాందోళనలకు గురికావాల్సి వస్తుందంటూ లబ్ధిదారులతో పాటు


గృహనిర్మాణాల్లో లోపాలను పరిశీలిస్తున్న మంత్రి

స్థానికులు చెప్పారు. అదే క్రమంలో ఓ ఇంటి గోడపై ఇల్లు అమ్మబడును అని ఉన్న బోర్డును చూసిన మనోహర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి వివరాలను స్పష్టం చేయాలని అధికారులను అదేశించారు.

పెదరావూరు లేఔట్ కోసం 78 ఎకరాలను సేకరించిన గత ప్రభుత్వం దానికి రూ.389 కోట్లు వెచ్చించిందన్నారు. లబ్ధిదారులకు సెంటు భూమి చొప్పున 3792 ప్లాట్లు ఏర్పాటు చేసి, కేవలం 1900 మందికి స్థలాలు మంజూరు చేశారని, 490 మంది ఇళ్లనే పూర్తి చేశారని అన్నారు. భూసేకరణ నుంచి స్థలాల కేటాయింపు, గృహ నిర్మాణాల వరకూ అనేక అక్రమాలున్నాయన్నారు. నిర్ధేశించిన ప్రమాణాలకు, హద్దులకు మించి నిర్మాణాలు జరుగుతుంటే అధికారులూ ప్రేక్షకపాత్ర వహించారన్నారు. రెండస్తుల ఇళ్లు కట్టుకునేవారు, ఇచ్చిన స్థలంలో ఇల్లు కట్టి అమ్ముకునే వారు నిజమైన అబ్ధిదారులా అని వ్యాఖ్యానించారు. లబ్ధిదారులను మోసం చేసిన కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలకు ఆదేశిస్తామన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలను సరిచేసి, పేదలకు మేలు చేస్తామన్నారు. ఉగాది నాటికి గృహనిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న, మంత్రి ఓఎస్డి యేసురత్నం, ఎంపిడిఒ కె.శిల్ప, గృహనిర్మాణ శాఖ ఈఈ వై.భాస్కరరావు, విజయవాడ ఎలక్ట్రికల్ ఈఈ (కనస్ట్రక్షన్స్) ఎం.శ్రీనివాసరావు, హౌసింగ్ డీఈ రఫీ, ఏఇ పిచ్చయ్య పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆశిష్కరించిన కేంద్ర మంత్రి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నీతి నిజాయితీ స్వచ్ఛతకు ఎన్టీఆర్ నిలువెత్తు నిదర్శనమని, 40 ఏళ్ల టిడిపి ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదిరించి నిలబడిందంటే కార్యకర్తలు, నాయకులే కారణమని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని 39వ డివిజన్, మారుతీ నగర్‌లో టిడిపి సీనియర్ కార్యకర్త సింగిశెట్టి వీరయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు విగ్రహాన్ని మంత్రి చంద్రశేఖర్ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం టిడిపి జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యకర్తలను ఆదుకోవడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నామన్నారు. స్థానికంగా రోడ్లు, డ్రెయిన్లు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, కార్పొరేషన్ కమిషనర్‌తో మాట్లాడి అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామని చెప్పారు. వైసిపి కార్పొరేటర్‌లను కూడా కలుపుకెళ్తామన్నారు.



కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గల్లా మాధవి, మహమ్మద్ నశీర్ అహ్మద్, టిడిపి నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, నాయకులు యు.సీతారామయ్య, డాక్టర్ ఎన్.శేషయ్య, ఎం.రాజేష్, ఎం.మ్యాని పాల్గొన్నారు.

దీర్ఘకాలం.. ఆపత్కాలం..

- ఇంజెక్షన్ వికటించి శాశ్వత వికలాంగునిగా బాలుడు
- 15 ఏళ్లుగా మంచానికే పరిమితం - భారంగా మందులు, పోషణ
- ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని వేడుకోలు

12 ఏళ్ల శిశువుగా ఉన్నప్పుడు ఇంజెక్షన్ వికటించి శాశ్వత వైకల్యం.. ఇది తెలిసి వది లేసి వెళ్లిన తండ్రి.. ఏమీ చేయలేని స్థితిలో తల్లి.. మంచానికే పరిమితమైన బిడ్డను 15 ఏళ్లుగా అష్టకష్టాలు పడుతూనే కళ్లల్లో పెట్టుకుని సాకుతున్న అమ్మమ్మ.. ఇది పొన్నూరు మండలంలోని వల్లభరాయపాలేనికి చెందిన వికలాంగుడు శ్రీసాయి ఈశ్వర్, అతని అమ్మమ్మ భారతికి వచ్చిన పెద్ద కష్టం..

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు మండలం వల్లభరాయపాలెంలోని భారతినగర్‌కు చెందిన భాగ్యలక్ష్మి 15 ఏళ్ల కిందట పొన్నూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ప్రసవించారు. బిడ్డ పుట్టిన 12 రోజులకు జ్వరం రావడంతో పొన్నూరులో పిల్లల ఆసుపత్రికి తీసుకెళ్లగా ఇంజెక్షన్ ఇచ్చిన వెంటనే బిడ్డ బులుగు రంగులోకి మారి, చలనం లేకుండా, కళ్ళు తేల్చి బిగిసుకుపోయాడు. వైద్యుల సలహాతో గుంటూరుకు తీసుకెళ్లగా ఇంజెక్షన్ వికటించిందని, వైకల్యం నయం కాదని ప్రాణాలు మాత్రం నిలపగలమని వైద్యులు తేల్చిచెప్పారు. ఇది తెలిసి బిడ్డ తండ్రి తన భార్యకు విడాకులిచ్చి మరో పెళ్లి చేసుకున్నాడు. దీంతో భాగ్యలక్ష్మి తన బిడ్డను తీసుకుని పుట్టింటికి చేరింది. అసలే పేద కుటుంబం కావడం, రెక్కాడితేగాని డొక్కాడని జీవితాలు కావడంతో బిడ్డ సంరక్షణ వారికి తలకు మించిన భారమైంది. ఈ క్రమంలో మంచానికే పరిమితమైన బిడ్డ బాధ్యతను అమ్మమ్మ నిజాంపట్నం భారతి తీసుకోగా తల్లి కూలి పనుల కోసం హైదరాబాద్ వెళ్లి నెలకు కాసిన్ని డబ్బులు పంపుతున్నారు. భారతి మాత్రం తానూ కూలి పనులకు వెళుతూనే శ్రీసాయి ఈశ్వర్‌ను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.


శ్రీ సాయి ఈశ్వర్ కు ఆహారం తినిపిస్తున్న అమ్మమ్మ భారతి

శ్రీసాయి ఈశ్వర్‌కు మందలు కోసం నెలకు రూ.6-8వేలు, పోషణ కోసం రూ.8 వేల వరకూ ఖర్చువుతున్నాయి. దీనికితోడు తరచూ ఫిట్స్ వస్తుండడంతో ఉరుకులు పరుగుల మీద గుంటూరులోని ప్రైవేటు ఆస్పత్రులకు పరుగెత్తాల్సి వస్తోంది. ఎంత బాధనయినా భరిస్తాం.. ఎంత కష్టమయినా ఓర్చుకుంటాం.. మాకు శక్తి.. మనవడికి ఆయుష్షు ఉన్నంత వరకూ కాపాడుకుంటాం.. అని భారతి చెబుతున్నారు. శ్రీసాయి ఈశ్వర్ వైకల్యం సరి చేయలేనిదే అయినా స్తోమతకు మించి ఆర్థిక భారాన్ని మోయలేని ఆ కుటుంబానికి ప్రభుత్వం ప్రత్యేక సాయం అవసరం. ఇప్పుడిస్తున్న రూ.6 వేల పింఛను ప్రత్యేక ప్రాతిపదికన రూ.15 వేలుగా ఇస్తే ఆ కుటుంబానికి కాస్తంత వెసులుబాటు ఉంటుందని ఆ కుటుంబం కోరుతోంది.



ఘనంగా బోనాల పండుగ

ప్రజాశక్తి-మంగళగిరి

దేవాంగ చేనేత కులదేవత శ్రీ శ్రీ శ్రీ రామలింగ చౌడేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవాన్ని స్థానిక కొప్పురావు కాలనీలో అమరావతి దేవాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సంఘం కోశాధికారి అల్లాక నమశ్శివాయ ఇంటి వద్ద మహిళలు బోనాలతో గ్రామోత్సవం చేశారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు బల్ల వెంకటరమణ అల్లక తాతారావు, అల్లక నమశ్శివాయ, రాష్ట్ర అధ్యక్షులు మాడిశెట్టి శివశంకరరావు, గౌరవ అధ్యక్షులు మత్స నిరంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

88 పాఠశాలలకు మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు : ఎంఇఒ-2

ప్రజాశక్తి - పొన్నూరు

మండలంలో 88 పాఠశాలలకు మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు ఈనెల 8వ తేదీన ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని ఎంఇఒ-2 కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలో 68 ప్రాథమిక పాఠశాలలు, 8 అప్పర్ ప్రైమరీ పాఠశాలలు, 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ఎన్నికలు ఉంటాయన్నారు. ఈనెల ఒకటవ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిందని, అదే రోజు ఓటర్ల జాబితా ప్రదర్శించారని తెలిపారు. 5వ తేదీ ఓటర్ల జాబితాలో అభ్యంతరాలను పరిశీలించి తుది జాబితా ఖరారు చేస్తారన్నారు. 8న మధ్యాహ్నం 1.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్‌ను చేతులెత్తే ప్రాతిపదికపై ఎన్నుకుంటారని, రెండు గంటలకు ప్రమాణస్వీకారం అనంతరం నూతన కమిటీ తొలి సమావేశం ఉంటుందని వివరించారు. ఈ కమిటీ ద్వారా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, మౌలిక సదుపాయాలు రూపకల్పన చేస్తారని చెప్పారు. ఒక్కొక్క తరగతికి ముగ్గురు సభ్యులు చొప్పున ఎన్నుకుంటారని వారిలో, ఇద్దరిని మహిళా సభ్యులను ఎన్నుకుంటారని తెలిపారు. వారితోపాటు ఆరుగురిని ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఉంటారని, హెచ్ఎం, ఉపాధ్యాయుడు, అంగన్వాడీ టీచర్, ఎఎన్ఎం, మహిళా సమాఖ్య అధ్యక్షులు కౌన్సిలర్‌లను నామినేటే చేస్తారని తెలిపారు. మరో ఇద్దరిని కోఆప్టెడ్ సభ్యులు ఎంపిక జరుగుతుందన్నారు.

వందేళ్ల ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

సిపిఐ ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా నూరు వసంతాల వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లి ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమరావతి బడ్జెట్లో కేటాయించిన రూ.15 వేల కోట్ల రూపాయలు అప్పుగా ఇప్పడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. దాన్ని గ్రాంటుగా మార్చాలని కోరారు. మంత్రి నారా లోకేష్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జె.జాన్‌బాబు, ఎం.డాంగే, ఎం.రామారావు, డి.కోటేశ్వరరావు, కె.సురేష్, ఎస్.శ్యామ్‌ప్రసాద్, సిహెచ్.కాంతి, బోసుబాబు, అనిల్‌కుమార్, ప్రశాంతరాజు పాల్గొన్నారు.



ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా చిల్డ్రన్స్ క్లబ్ ఏర్పాటు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

స్నేహితుల దినోత్సవం సందర్భంగా మండలంలోని పొనుగుపాడులో 50 మంది బాలబాలికలతో చిల్డ్రన్స్ క్లబ్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ స్నేహం గొప్పతనాన్ని, మానవతా విలువలను గురించి వివరించారు. పరస్పరం స్నేహభావంతో మెలగాలని, సేవాభావం కలిగి ఉండి ఒకరికొకరు సహకరించుకోవడంతోపాటు ఇతరులకూ సాయ పడాలని చెప్పారు. ఈ మేరకు వారితో ప్రతిజ్ఞ చేయించారు. బాల బాలికలు చేతులకు ఫ్రెండ్షిప్ బ్యాండ్స్ కట్టించారు. జి.బాలకృష్ణ, కార్తిక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.





వయనాడ్ బాధితులకు విరాళాలు సేకరణ





ప్రజాశక్తి-గుంటూరు

కేరళ రాష్ట్రంలోని, వయనాడ్ వరద బాధితుల కోసం సిపిఎం గుంటూరు నగర కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో ఆదివారం విరాళాలు సేకరించారు. బ్రాడీపేటలోని సిపిఎం కార్యాలయం నుండి శంకర విలాస్, తాలుకా మీదుగా అరండల్‌పేట 4వ లైన్ తదితర వీధుల్లో షాపులు, ప్రజల నుండి సిపిఎం కార్యకర్తలు విరాళాలు సమీకరించారు. సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రం వయనాడులో కొండచర్యలు విరిగిపడి విలయం సృష్టించిన ఘటనలో 300 మందికి పైగా చనిపోయారని అన్నారు. వరదలతో ఊళ్లకు ఊళ్లు కొట్టుకుపోయాయని, వందలమంది నిరాశ్రయులు అయ్యారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి, వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విరాళాల సేకరణలో నాయకులు కె.శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు, ఎం.ఎ.చిష్టి, బి.లక్ష్మణరావు, షేక్ ఖాశిం షహీద్, బి.సత్యనారాయణ, ఎ.నికల్సన్, షేక్ ఖాశింవలి, ఎ.కళ్యాణి, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు ఎస్.పద్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్.సమీర్, ఎం.కిరణ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని సుందరయ్యనగర్‌లో ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, ప్రజాశక్తి సిజిఎం వై.అచ్యుతరావు, ఎస్‌కె ఖాజావలి, సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, కె.కరుణాకరరావు, బి.రామచంద్రరావు, ఎన్.నాగేశ్వరరావు, బేబి, కె.ఉషారాణి, పి.గిరిజ, సిహెచ్.భుజంగరావు, కొండబాబు, కె.మేరి, సుధ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని చిన్నకాకానిలో సిపిఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, నాయకులు జి.బాబువరప్రసాద్, వి.పూర్ణయ్య, కె.శంకరరావు, టి.వెంకటేశ్వరరావు, పి.రాంబాబు, జి .నాగరాజు పాల్గొన్నారు.

వయనాడ్ ఘోరాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి

ప్రజాశక్తి-గుంటూరు

కేరళలోని వయనాడ్ జిల్లాలో చోటు చేసుకున్న ప్రకతి విలయాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఈ ఘటన దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని, ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరుగా ఉన్న ప్రాంతాలన్నీ ఇప్పుడు నేలమట్టమైపోయాయని, ఈవిషాద సమయంలో కేంద్రం కేరళ పట్ల సానుభూతితో వ్యవహరించాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. వయనాడ్ ఘోరాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలన్న విపక్ష పార్టీల అభ్యర్థనను పరిశీలించి కేరళను భారీ ఆర్థిక సహాయంతో ఆదుకోవాలని కోరారు. భాధిత కుటుంబాలకు ఈ విపత్కర సమయంలో సంఘీభావం తెలియజేయడం, ఉదారంగా విరాళాలివ్వటం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు.

పేదల్లో కలకలం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని రైల్వే స్థలాల్లో నివశిస్తున్న పేదల్లో కలకలం బయల్దేరింది. గత రెండు రోజుల నుంచి రైల్వే అధికారులు ఈ ప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్నారు. రైల్వే స్థలాలకు హద్దులు నిర్ణయిస్తున్నారు. ఈ క్రమంలో తమ ఇళ్లు ఎప్పుడు ఉంటాయో ఉండవోననే ఆందోళన నెలకొంది. తాడేపల్లి ఇరిగేషన్, కొండ ప్రాంతాలు, రైల్వే స్థలాల్లో నివశిస్తున్న పేదలకు తాను అధికారంలోకి వస్తే పట్టాలిప్పిస్తానని ఎన్నికల సందర్భంగా నారా లోకేష్ వాగ్దానం చేశారు. ఆ హామీ తమ నివాసాలు ఇక్కడే ఉండేలా చూడాలని, రైల్వే స్థలాలకు పట్టాలు ఇప్పించాలని పేదలు కోరుతున్నారు.

కిట్స్ అక్షర్‌కు నాక్-ఎ గ్రేడ్

ప్రజాశక్తి-గుంటూరు

యనమదలలోని కిట్స్ అక్షర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి నాక్ గుర్తింపు లభించింది. జులై 18, 19 తేదీల్లో జరిగిన నాక్ ఇన్‌స్పెక్షన్ ఫలితాన్ని నేడు విడుదల చేశారని చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. కళాశాల నాక్ -ఎ గ్రేడ్ సాధించింది అని తెలిపారు. సెక్రెటరీ కోయి శేఖర్, డైరెక్టర్ గోగినేని సాంబశివరావు మాట్లాడుతూ కళాశాలకు నాక్ ఎ గ్రేడ్ సాధించినందుకు అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకోటయ్య మాట్లాడుతూ ఈ గుర్తింపునకు సహకరించిన అధ్యాపకులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.



ప్రతి 10 మందిలో 8 మందికి రక్తహీనత!

మహిళలు ముఖ్యంగా బాలింతలు రక్తహీనత (ఎనిమీయా) పట్ల అవగాహన కలిగి ఉండాలని పల్నాడు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి అన్నారు. చిన్నారులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని, తద్వారా శిశువు ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని చెప్పారు. జిల్లాలోని గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు, 60 ఏళ్లు పైబడిన వారికి వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం తల్లిపాల వారోత్సవాలు, అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా కొనసాగుతోందన్న ఆమె ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.



- **బాలికలు రోజుకు అరలీటర్ పాలు, ఉడికించిన గుడ్డు తీసుకోవాలి**
- **0 నుండి 60 ఏళ్ల పైబడిన వారికి వ్యాధి నిరోధక టీకాలు**
- **1.06 లక్షల మందికి అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ పూర్తి**
- **టీకాలతో వ్యాధుల నియంత్రణ**
- **ప్రజాశక్తితో పల్నాడు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి**

ప్రధానంగా ఏయే సమస్యలు ఎదుర్కొంటున్నారు?

మానవ సమాజానికి మూలం మహిళ. కుటుంబాన్ని ఉన్నత స్థితికి తీసుకుపోవడంలో ఆమె పాత్ర కీలకం. అలాంటి మహిళ నేటి ఆధునిక సమాజంలోనూ రక్తహీనతతో బాధపడుతోంది. ప్రతి 10 మంది మహిళలలో 8 మంది రక్త హీనత బాధితులే. గ్రామీణ మహిళలు పోషకాహార లేమివల్ల రకరకాల ఆరోగ్య సమస్యలకు గురువుతున్నారు. గర్భ సంచి ముఖ ద్వారా కేన్సర్ బారిన పడుతున్నారు. ప్రతి మహిళ 22 ఏళ్ల నుండి 55 ఏళ్లు వచ్చే వరకు ప్రతి 6 నెలలకు ప్యాప్సియర్ టెస్ట్ చేయించుకోవాలి. దీనివలన కేన్సర్ దశలను గుర్తించి జాగ్రత్తలు తీసుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికి టీనేజ్ ప్రెగ్నెన్సీ, అబార్షన్‌లు ఎక్కువవుతున్న నేపథ్యంలో కొన్ని సందర్భాల్లో ప్రాణ నష్టమూ వాటిల్లుతోంది.



రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు?

మొదట పోషకాహారం తీసుకోవాలి. ఆడ పిల్లలు మూడేళ్ల నుండి ప్రతిరోజూ 500 మిల్లీలీటర్ల పాలు, ఉడకబెట్టిన గుడ్డు ఆహారంలో భాగం చేసుకోవాలి. మహిళలు ఆకు కూరలు, పల్లి చిక్కీలు, రాగి మురుకులు, పాలు, గుడ్లు, బెల్లం, మటన్, కర్జూర పండ్లు వంటివి తినే ఆహారంలో ఉంచుకోవాలి. గైనకాలజి వైద్యుల సలహాతో ఐరన్ ట్యాబ్లెట్లు, టానిక్‌లు వాడాలి. రక్తహీనత ఉంటే అధిక నిద్ర, కళ్లు తిరగడం, నీరసం, వంటి లక్షణాలుంటాయి. రక్త హీనత తెలుసుకోవడానికి పరీక్షలు చేసుకోవాలి.

శిశువుకు ముర్రు పాలు ఎప్పటినుండి పట్టించాలి?

జిల్లాలో 11378 మంది గర్భిణులు, 9752 మంది బాలింతలు ఉన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే వైద్యుల సలహాతో ముర్రుపాలు పట్టించాలి. చాలామంది మహిళలు ప్రసవం అనంతరం శిశువుకు ముర్రుపాలు పట్టించరు. ఇది శ్రేయస్కరం కాదు. బిడ్డ పుట్టిన నిమిషం లోపలే తల్లి రొమ్ము పట్టించి మురుగు పాలు పట్టించాలి. శిశువు 6 నెలల వచ్చే వరకు తల్లి పాలు తప్ప ఎలాంటి ఆహారమూ ఇవ్వరాదు.

శాఖాపరమైన కార్యక్రమాలు ఎలా సాగుతున్నాయి?

ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహిస్తుండడంతో అనేక రోగాలు నియంత్రణలో ఉంటున్నాయి. ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో పాల్గొంటున్న వైద్య సిబ్బందికి ప్రజలు పూర్తిగా సహకరిస్తే కొన్ని రోగాలను పూర్తిగా రూపుమాపవచ్చు

ఇమ్యూనైజేషన్‌కు ఏ ఏర్పాట్లు చేశారు?

ఇమ్యునైజేషన్ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అవగాహన పెంచేందుకు ప్రత్యేకమైన ప్రణాళికలు రూపొందించాం. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించడం. ప్రతి మంగళవారం ఆశా డే పురస్కరించుకుని వారితో సమావేశం, ప్రతి బుధవారం ఇమ్యునైజేషన్ కార్యక్రమం, ప్రతి గురువారం రక్తహీనతపై అవగాహన, రక్త పరీక్షలు నిర్వహణ, మందుల వినియోగం, ప్రతి శుక్రవారం ఫ్రైడే ఫ్రైడేగా నిర్వహించడం, ప్రతి శనివారం ఇమ్యునైజేషన్‌లో భాగంగా అవుట్ రీచ్ ఏరియాల్లో కార్యక్రమాన్ని చేపడుతున్నాం. జిల్లా వ్యాప్తంగా వైద్య సిబ్బంది తమ తమ పరిధిలో కార్యక్రమాలను విధిగా చేపడుతున్నారు.

టీకాలు ఎవరెవరికి ఇస్తున్నారు? ఎలాంటి వ్యాధుల కోసం?

వ్యాధులు రాకుండా నియంత్రించేందుకు ముందస్తుగా టీకాలు ఇవ్వడంతో పాటు చిన్న పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు, ప్రత్యేక సమయాల్లో బాధితులకు టీకాలు వేస్తున్నాం. చిన్న పిల్లల్లో, గర్భిణుల్లో, బాలింతలలో రక్తహీనతను అరికట్టేందుకు ప్రాథమికంగా ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు క్షేత్రస్థాయిలో రక్తహీనత ఉన్నవారిని గుర్తించి ప్రతి గురువారం ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇస్తారు. గర్భం దాల్చిన 12 వారాలలోపు వారి పేర్లను నమోదు చేసి గుర్తింపు సంఖ్య ఇస్తున్నారు.

ముందస్తు చర్యలు తీసుకుంటున్నా ప్రమాదాలకు కారణం?

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రసవ సమయంలో బిపి నియంత్రణలో లేకున్నా, 9 నెలలు నిండినా డెలివరీ కాలేని పరిస్థితితుల్లో, గర్భంలో పిండం అడ్డం తిరిగినా తల్లీబిడ్డకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. సాధారణ డెలివరీ కాకుండా అసాధారణ డెలివరీ అయినప్పుడు, ఇళ్ల వద్ద ప్రసవాలు, హాస్పిటల్‌కు వచ్చే మార్గం మధ్యలో జరిగే డెలివరీల సమయంలో ప్రమాదాలు సంభవించవచ్చు. జిల్లాలోని 3 ఏరియా ఆసుపత్రుల్లో 63 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, 7 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో, 26 అర్బన్ ప్రైమరీ సెంటర్లలో అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ అపోహలు వీడి 60 ఏళ్ళు పైబడిన ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా జీవించొచ్చు.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా